క్లుప్తంగా

మహిళలకు వైఎస్సార్‌సీపీ నేతల కృతజ్ఞతలు

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్ బాల్ క్రీడామైదానంలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడవ విడత సంబరాలు విజయవంతమయ్యాయి. స్వయం సహాయక సంఘాల మహిళలు వేలాదిగా తరలివచ్చి ఆసరా సంబరాలు విజయవంతం చేసినందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం వారికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు బ్రెడ్లు, ఎండుద్రాక్ష అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక టైలర్స్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం గర్భిణులకు పౌష్టికాహారం(బ్రెడ్లు, ఎండు ద్రాక్ష) లయన్స్ క్లబ్, మహిళా లయన్స్ క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్ట్ గవర్నర్ రమేష్ నాథరెడ్డి, మహిళా క్లబ్ ప్రెసిడెంట్ రాజేశ్వరీ, సభ్యులు భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, వాణి, జ్యోతి, లత, రాధ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మీటే తండాకు చెందిన ఓ మహిళ కడుపు నొప్పి తాళలేక ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వివరాల్లోకి వెళితే.. తండాకు చెందిన చంద్రిక బాయి కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితం పై విరక్తి చెందిన ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఆరుగురిపై కేసు నమోదు

గుత్తి: పట్టణంలోని చెంబుల బావి వీధిలో గత శుక్రవారం రమణ, గోపాల్ వర్గాల మధ్య చిన్నపాటి విషయంపై ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన నలుగురు గాయపడ్డారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు గోపాల్, కృష్ణవేణి, కిరణ్, రమణ, వేమారెడ్డి, హరికృష్ణపై కేసు నమోదు చేశారు.

బీఎస్పీ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని ఎన్నుకుంటున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం గుంతకల్లు నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. బిఎస్పీ జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం సమక్షంలో అధ్యక్షుడిగా విజయ్, కన్వీనర్‌గా బి.వెంకట కొండయ్య, ఇన్‌చార్జ్‌గా డి. శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షురాలిగా రిజ్వానా, ప్రధాన కార్యదర్శిగా భరత్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని నూతన కమిటీ సభ్యులు వెల్లడించారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

గార్లదిన్నె: నార్పల మండలం బొందల వాడకు చెందిన రమాదేవి హత్యకు నిరసనగా ఆదివారం గార్లదిన్నెలో చేపట్టిన హైవే బంద్ జరగకుండా ముందస్తుగా అరెస్టులు చేయడం సరికాదని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప, కదిరప్ప పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ రమాదేవి హత్యకు కారకులైన నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు ఎక్స్ గ్రేసియా చెల్లించాలన్నారు. దళిత సంఘం నాయకులు నాగరాజు, మల్లికార్జున, పుల్లన్న, ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం



అగ్నికి ఆహుతైన పశుగ్రాసం

యాడికి: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామస్తుల వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన తోట నారాయణరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, పాపిరెడ్డిగారి నారాయణరెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వారి కళ్లం దొడ్డిలో వేరుశనగ, జొన్నసొప్ప, వరిగడ్డితో మూడు వాములు వేసుకున్నారు. ఆదివారం సాయంత్రం 3 గంటల సమయంలో ఆకతాయిలు నిప్పు పెట్టారు. సమాచారం అందుకున్న తాడిపత్రి ఫైరింజన్ సిబ్బంది వచ్చే లోపు పశుగ్రాసం పూర్తిగా కాలిబూడిదైంది. రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

ఆసరాతోనే మహిళల ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి





డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సభకు హాజరైన మహిళలు

నార్పల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వైఎస్సార్ ఆసరా పథకంతోనే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్ ఆసరా మూడో విడో కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఆమె సచివాలయం-2 భవనం, మసీదుకట్ట వంతెన, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆసరా సమావేశంలో మాట్లారు. రాష్ట్రంలోని మహిళలను జగనన్న తన సొంత అక్క,చెల్లెమ్మలతో సమానంగా చూసుకుంటున్నారన్నారు. కడుపులో పుట్టిన గర్భం నుంచి వారి పిల్లల చదువు పూర్తయ్యే వరకు అన్ని బాగోగులకు తానై నిలిచారన్నారు. పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని తలచి ఆయన వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలను తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాలకు దాదాపు రూ.2 వేల కోట్లు వెచ్చించి గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం జగనన్న అమ్మఒడి పథకం ద్వారా బడికి వెళ్లే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు జమ చేస్తున్నారన్నారు. తాను అమలు చేసే ప్రతి పథకాన్ని మహిళకే అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ చేయూత ద్వారా 45 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మహిళలకు ఏడాదికి రూ.18,750 ఆర్థికసాయం, డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ రుణాలు, వైఎస్సార్ ఆసరాతో పాటు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు కట్టించి వారి పేరు మీదే పక్కా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా ఉన్న 1,055 పొదుపు సంఘాల్లోని 10,587 మంది అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద రూ.9.48 కోట్ల చెక్కు అందించారు. డ్వాక్రా మహిళలు ఆమె సమక్షంలో జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ చామలూరు హరిత, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచు మన్నీల సుప్రియ, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మిద్దె కుళ్లాయప్ప, వైస్ ఎంపీపీ వెంకటలక్ష్మి, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, కో ఆప్షన్ షాబీరా, ఎంపీటీసీలు బాలనాగి భాగ్యలక్ష్మి, నారాయణమ్మ, శంకర్‌యాదవ్, రాజారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు దాడితోట బాషా కేశవరెడ్డి, వార్డ్ మెంబర్ గిరిక రమణమ్మ, రాష్ట్ర మహిళా కార్యదర్శి మన్నెరి కొండమ్మ, బాలకృష్ణ, గోపాల్, శివయ్య, గొళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు హాజరయ్యే స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, స్పందనలో ఫిర్యాదు చేసే ప్రజలు ఆధార్, సెల్ ఫోన్ నంబర్లను తప్పకుండా వేయాలని సూచించారు.

వైభవంగా నాగలింగేశ్వరస్వామి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో నాగలింగేశ్వరస్వామి

పుట్లూరు: మండలంలోని జంగంరెడ్డిపేట గ్రామంలో వెలసిన నాగలింగేశ్వరస్వామి గ్రామోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎల్లుట్ల గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి ఆయుధాలకు పూజలు చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం



గుంతకల్లులో రూము నంబర్ చూస్తున్న విద్యార్థి

గుంతకల్లుటౌన్: పట్టణంలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని భాష్యం, శ్రీచైతన్య(పీఅండ్‌టీ కాలనీ బ్రాంచ్), నారాయణ, రైల్వే ఇంగ్లిష్ మీడియం, డాక్టర్ సరోజినినాయుడు, సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూళ్లతో పాటు రోటరీ, ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 2,100 మంది రెగ్యులర్, 385 మంది కంపార్ట్‌మెంటల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 8 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 8 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులతో పాటు 92 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు ఎంఈఓ కుళ్లాయప్ప తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్లతో ఉదయం 8:45 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించేది లేదని ఆయన వెల్లడించారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ చంద్రనాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 3 నుంచి 18 వ తేదీ వరకు టెన్త్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మండలంలో మూడు సెంటర్లలో 842 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. పరీక్షలు రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు అర గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘాతోపాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

యల్లనూరు: స్థానిక జెడ్పీహైస్కూల్, చిలమకూరు ఆదర్శ పాఠశాలలో సోమవారం జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. జెడ్పీ హైస్కూల్లో 230 మంది, చిలమకూరు ఆదర్శ పాఠశాలలో 155 మంది విద్యార్థులతో పాటు 59 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నారన్నారు.

పామిడి: పట్టణంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పామిడిలో టీసీ హైస్కూల్, ఎస్ఎఫ్ఎస్, సరస్వతీ ఉన్నత విద్యామందిరం పరీక్షకేంద్రాలుగా ఏర్పాటు చేశారు. మొత్తం 954 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాలకు చీఫ్‌లుగా రామాంజనేయులు, మహాలక్ష్మి, సుంకన్న వ్యవహరించనున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమనిఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అనంతసాగర్ కాలనీ, విజయనగర్ కాలనీలలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు కాలనీ వాసులు టపాసులు పేలుస్తూ పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ముందుగా కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య తన దృష్టికి తేవడంతో వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్ర ద్వారా జగనన్న ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి అనుగుణంగా మేనిఫెస్టో తయారు చేశారన్నారు. ప్రజల దీవెనతో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. వాటితో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. అర్హుల ఇంటి ముంగిటకే పథకాలు అందించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. ఏదైన కారణాల వల్ల సంక్షేమ పథకాలు రాకున్నా...వాటిని పరిశీలించమని, సచివాలయ సిబ్బంది, మండల అధికారులను అక్కడికక్కడే పిలిచి ఆదేశాలు జారీ చేశారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నేత ఆలూరి రమణారెడ్డి, సర్పంచ్ పార్వతి, యువనేత ఆలూరి ఎర్రిస్వామి రెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న, సొసైటీ అధ్యక్షుడు గువ్వల పెద్ద వెంకటరెడ్డి, ఎంపీటీసీలు కాలువ వెంకటలక్ష్మి, రాజేశ్వరి, వైస్ సర్పంచ్ వరలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, నాయకులు పూల నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, చేపల రమణ, చంద్రమోహన్, శేషానందరెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, చెదుల్ల శ్రీనివాసరెడ్డి, పూల రంగా, కప్పల సూర్యనారాయణ, వడ్డే హరేంద్ర, రాజారెడ్డి, దండు ఆనంద్ కుమార్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న టీడీపీ కార్యకర్త



ఆగిపోయిన రోడ్డు మరమ్మతు పనులు

పెద్దపప్పూరు: రోడ్డు మరమ్మతు పనులకు టీడీపీ కార్యకర్త అడ్డుతగలడంతో అర్ధంతరంగా ఆగిపోయాయి. వివరాలు.. పసలూరు నుంచి కమ్మవారిపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయమై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ప్రజా సంక్షేమయాత్రలో గ్రామస్తులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు మరమ్మతు చేపట్టాలని అప్పట్లో అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో 15రోజులుగా రోడ్డు మరమ్మతులు చేస్తుండగా పసలూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పయ్యావుల కేశవనాయుడు అనే రైతు రోడ్డు పక్కనే ఉన్న తన పొలం వద్ద పనులు జరగకుండా రాళ్లను అడ్డుగా వేసి పనులను అడ్డుకున్నారు. భూమి కొలతలు తర్వాతే రోడ్డు వేయాలని భీష్మించాడు. దీంతో అధికారులు చేసేదిమి లేక పనులు ఆపేశారు. ఇదే విషయమై తహసీల్దార్ షర్మిళను ఫోన్ ద్వారా సంప్రదించగా ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించి కేశవనాయుడు అనే రైతుకు ఎంత మేర భూమి ఉందన్న విషయమై కొలతలు వేసి తగు చర్యలు చేపడతామన్నారు. అభివృద్ధి పనులకు ఎవ్వరు అడ్డు చెప్పినా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు



లక్ష్మీ నరసింహస్వామి అలంకారంలో శ్రీరాముడు

తాడిపత్రి టౌన్ : స్థానిక ఏటిగడ్డపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వసంత నవరాత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా నాల్గవ రోజు ఆదివారం రాత్రి లక్ష్మీనరసింహస్వామి అలంకారంలో శ్రీరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు, స్వామి ఉత్సవ విగ్రహాలకు జలాభిషేకం, క్షీరాభిషేకం అనంతరం రంగు,రంగుల పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామితోపాటు 108 సాలా గ్రామ శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకార్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నేడు 'ఆలూరు' పర్యటన

శింగనమల: మండలంలోని లోలూరు, ఆకులేడు, వెస్ట్ నరసాపురం, శింగనమల, సోదనపల్లి గ్రామ సచివాలయల పరిధిలో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సోమవారం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్ ఆదివారం తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొనాలని కోరారు.

మొక్కజొన్న పైరు దగ్ధం



కాలిపోయిన పైరు

పుట్లూరు: మండలంలోని చాలవేముల గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పైరు దగ్ధమైంది. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, ఈశ్వరమ్మ అనే రైతులకు చెందిన మొక్కజొన్న పూర్తిగా కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంతో రూ.2లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



విరిగిపడిన విద్యుత్ స్తంభం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గంటచర్చి ఎదురుగా ఉన్న గల్లీలో ఆదివారం సాయంత్రం విద్యుత్ స్తంభం నేలకూలింది. అయితే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ సుధాకర్ ట్రాన్స్‌కో అధికారులకు సమాచారమిచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. వార్డులో ఐదారు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయని వాటిని తొలగించి కొత్త స్తంభాలను వేయాలని గతంలో అనేకమార్లు ఫిర్యాదు చేసినా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోలేదని కౌన్సిలర్ సుధాకర్ వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న మిగిలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి గ్రామానికి చెందిన మంజుళ అనే మహిళకు రూ.20 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం మంత్రి ఉషశ్రీచరణ్ తన కార్యాలయంలో అందజేశారు. ఇటీవల మంజుళ ఊపిరి తిత్తుల సమస్యతో బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందింది. బాధితురాలు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో పై మొత్తం మంజూరైంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాస్వామి, వైస్ ఎంపీపీ బీజప్ప, సర్పంచ్ అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

పెద్ద శేషవాహనంపై కోన రంగనాథుడు



తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. చైత్ర శుద్ధ ద్వాదశిని పురస్కరించుకొని ఆలూరు కోన రంగనాథస్వామిని ప్రత్యేక అలంకరణలో ఆలయ అర్చకులు ముస్తాబు చేశారు., అనంతరం స్వామి వారిని పెద్ద శేష వాహనంపై ఆలూరు గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

బాలుడికి గాయాలు

గుత్తి రూరల్: ధర్మాపురం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జస్వంత్ ఇంటి నుంచి తమ వ్యవసాయ పొలంకు వెళ్తూ కాలుజారి కింది పడ్డాడు. ప్రమాదంలో కింద పడిన జస్వంత్‌కు రాయి తగిలి తల, చేతులకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే బాలుడిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

10లోపు వివరాలు సమర్పించాలి

గుంతకల్లు రూరల్: ఈ ఏడాది హజ్ యాత్రకు ఎంపికైన వారు ఈనెల 10లోపు తమ పూర్తి వివరాలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం హజ్‌కమిటీ సమన్వయ కర్త అల్‌హజ్‌ముల్లా మస్తాన్ వలీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్వాన్సు రుసుం రూ.81,800 చలానా లేదా ఆన్‌లైన్ రశీదు కాపీ, మెడికల్ సర్టిఫికెట్, ఒరిజినల్ పాస్‌పోర్టు, 2 పాస్‌ఫోర్ట్‌సైజ్ ఫొటోలతో కలిపి జిల్లా హజ్ కార్యాలయంలో లేదా విజయవాడ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

సంతల ఆదాయం రూ.3.53 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన సంతల ద్వారా రూ.3.53 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1.83 లక్షలు వసూలు కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1.69 లక్షల ఆదాయం వేలం ద్వారా సమకూరినట్లు పేర్కొన్నారు.

సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: స్థానిక సుంకులమ్మపాలెం క్రీస్తురాజు ఆలయంలో మట్టల(ఖర్జూర కొమ్మల) ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం చర్చి ఫాదర్ డేవిడ్ ఆర్లప్ప ఆధ్వర్యంలో మట్టలను చేత పట్టుకుని పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

పామిడి: మండలవ్యాప్తంగా ఆదివారం మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ సౌజన్య ప్రసంగించారు. అంతకుముందు క్రైస్తవులు మట్టలు చేతబూని కీర్తనలు ఆలపిస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, జకరయ్య, అబ్రహాం, విజయభాస్కర్, కరుణాకర్, బుజ్జిబాబు, రాజు, గుణశేఖర్, రత్నబాబు, ప్రభాకర్, ప్రసాద్, రజని, మేరీ, మంజుల, చంద్రకళ, సునాలినీ, రేచెల్, సుశీలమ్మ, జయామణి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : దిమ్మగుడి, పెద్దవడుగూరు గ్రామాల్లోని ఐఎస్ఈసీ చర్చిల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పోతురాయి శేఖర్, జాన్‌డేవిడ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈత మట్టలు పట్టుకొని చర్చి చుట్టూ తిరిగారు. ఆనందకుమార్, ఇమ్మానుయేల్, జయప్ప తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటక ప్రదర్శన



నాటకంలోని ఓ సన్నివేశం

గుంతకల్లు రూరల్: రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భగవాన్ సత్యసాయిబాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను ఆలయ సమీపంలోని గంగా నిలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన పంచమాంకాలు చూపరులను కట్టిపడేశాయి. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం ఆనందదాయకమని భక్తులు పేర్కొన్నారు.

కొనసాగిన చెన్నమ్మ తిరునాల

పెద్దవడుగూరు : రావులుడికి గ్రామంలో చెన్నమ్మ తల్లి తిరునాల నాలుగో రోజు కొనసాగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భీమునిపల్లి నుంచి పన్నేరపు బండ్ల పై ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సుడిబండిని లాగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా యస్ఐ రాజశేఖర్‌రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం నిండు తిరునాల, మధ్యాహ్నం 2 గంటల లోపు పొంగు పాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.